ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.8 । కనిష్ఠం 18.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024




నిజాంసాగర్ ప్రస్తుత నీటి మట్టం


అలుగు దూకుతున్న పోచారం ప్రాజెక్టు

అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు

జలకళ

కామారెడ్డి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన ప్రాజెక్టుల్లో, చెరువుల్లో, వాగుల్లో జలసవ్వడి నెలకొంటుంది. పట్టణాలు, మారుమూల గ్రామాలు ఎటు చూసినా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ సీజన్‌లో ఆలస్యంగానైన వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సెప్టెంబరులో ప్రాజెక్టులు, చెరువులు పూర్తిస్థాయిలో నిండడం విశేషం. ఆయా ప్రాజెక్టులు, చెరువుల కింద ఆయకట్టు రైతులకు జలసిరులుగా భరోసానిస్తున్నాయి. వానాకాలం పంటలకే కాకుండా వచ్చే యాసంగి సీజన్‌కు సైతం సాగునీటి డోకా లేనట్టే. నిజాంసాగర్ ప్రాజెక్టు ఇప్పటికే సగానికిపైగా నిండింది. ప్రాజెక్టులోకి భారీగానే వరద వచ్చి చేరుతోంది. పోచారం ప్రాజెక్టు సైతం నిండి అలుగు దూకుతుంది. కళ్యాణి, సింగీతం రిజర్వాయర్‌లు సైతం పూర్తిగా నిండడంతో గేట్లు ఎత్తి నిజాంసాగర్ వరద కాలువలోకి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు జిల్లాలోని సుమారు 845 చెరువులకు పైగా నిండడమే కాకుండా అలుగు దూకుతున్నాయి. మిగితా చెరువులు 75 శాతం నిండినట్లు నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

అలుగు దూకిన 845 చెరువులు

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుల్లో జలసవ్వడి నెలకొంటుంది. చెరువుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో నీటితో కళకళాడుతున్నాయి. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, నిజాం సాగర్ నీటి పారుదలశాఖ డివిజన్‌ల పరిధిలో మొత్తం 1515 చెరువులు ఉన్నాయి. ఇందులో 845 చెరువులు ఇప్పటికే పూర్తిగా నిండి అలుగు దూకుతున్నాయి. 279 చెరువులు వంద శాతం నిండాయి. 286 చెరువులు 75 శాతం నిండగా 96 చెరువులు 50 శాతం, 9 చెరువులు 25 శాతం నిండాయి. ఈ చెరువుల ఆయకట్టు కింద లక్షల ఎకరాల్లోనే పంటలు సాగవుతున్నాయి. మొన్నటి వరకు వర్షాలు లేక చెరువుల్లో నీరు లేక వెలవెలబోవడంతో రైతన్నలు పంటల సాగుపై ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ చెరువులు నిండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం పంటల సాగుకే కాకుండా యాసంగి పంటలకు సైతం సాగునీరు అందే అవకాశం ఉంటుందని రైతులు భరోసా వ్యక్తం చేస్తున్నారు.

12 టీఎంసీలకు చేరిన నిజాంసాగర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న ప్రధాన జలాశయం నిజాంసాగర్. ఈ ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, బిచ్కుంద, బాన్సువాడ, నస్రూల్లాబాద్, బీర్కూర్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని లక్ష ఎకరాలకు పైగా సాగు నీటిని అందిస్తోంది. గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో ఉమ్మడి జిల్లాల రైతాంగానికి రెండు సీజన్‌లకు తాగు, సాగు నీటిని అందించారు. అయితే ఈ సీజన్‌లో ఆగస్టు గడుస్తున్నా వర్షాలు లేక ప్రాజెక్టులో నీరులేక పోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన చెందుతూ వచ్చారు. ప్రభుత్వం సైతం కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీలను నిజాంసాగర్‌కు తరలించేందుకు అనుమతులు ఇచ్చింది. అడపాదడపగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 4 టీఎంసీల వరకు నీటి మట్టం చేరింది. అయితే ఈ మూడు రోజుల వ్యవధిలోనే భారీ వర్షాలు కురువడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరింది. ఎట్టకేలకు నిజాంసాగర్ సగం నిండుకోవడంతో ఆయకట్టు రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.468 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సాగర్‌లోకి 34,600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మరో రెండు మూడు భారీ వర్షాలు పడితే త్వరగానే నిజాంసాగర్ ప్రాజెక్టు సైతం పూర్తిగా నిండే అవకాశాలు ఉన్నాయని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

- జిల్లాలో జలకళను సంతరించుకుంటున్న చెరువులు, ప్రాజెక్టులు
- జిల్లాలో అలుగు దూకుతున్న 845 చెరువులు
- వంద శాతం నిండిన 279 చెరువులు
- నిండుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు
- 12 టీఎంసీలకు చేరిన ప్రాజెక్టు నీటి మట్టం
- పొంగి పొర్లుతున్న పోచారం ప్రాజెక్టు
- కళ్యాణి రిజర్వాయర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- మత్తడి దూకుతున్న సింగీతం, కామారెడ్డి పెద్ద చెరువులు

అలుగు దూకుతున్న పోచారం

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లోని సుమారు 17 వేల ఎకరాలకు సాగు నీరు అందించే ప్రాజెక్టు పోచారం. గాంధారి, తాడ్వాయి, లింగంపేట మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడం, అటవీ ప్రాంతాల్లోని పాయల ద్వారా వరద నీరు పోచారం ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలకు లింగంపేట పెద్ద చెరువు, తాడ్వాయిలోకి భీమేశ్వరం వాగు ఉధృతంగా ప్రవహిస్తు పోచారంలోకి చేరాయి. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో అలుగు దూకుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 1.820 టీఎంసీలు పూర్తిగా నిండడంతో ప్రాజెక్టులోకి 18వేల 864 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిండుకుని అలుగు దూకుతుండడంతో అందాలు చూసేందుకు పర్యాటకులు క్యూకడుతున్నారు. దీంతో ప్రాజెక్టుల వద్ద పర్యాటకుల సందడి నెలకొంటుంది.

మత్తడి దూకుతున్న సింగీతం.. కళ్యాణి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, ఎల్లారెడ్డి మండలాల్లోని సింగీతం, కళ్యాణి రిజర్వాయర్‌లు సైతం నిండడంతో జలకళను సంతరించుకున్నాయి. ఈ రిజర్వాయర్‌లు పూర్తిస్థాయిలో నిండడంతో గేట్లు ఎత్తి నిజాంసాగర్ వరద కాలువలోకి నీటిని వదులుతున్నారు. సింగీతం రిజర్వాయర్ 416 అడుగులు కాగా పూర్తిస్థాయిలో నిండింది. ఈ రిజర్వాయర్‌లోకి 4,760 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిండుకోవడంతో మత్తడి దూకుతుండడం చూడచక్కగా మారింది. అదేవిధంగా కళ్యాణి ప్రాజెక్టు సామర్థ్యం 408 అడుగులు కాగా ఈ ప్రాజెక్టు సైతం పూర్తిగా నిండుకుంది. ఇందులోకి 488 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 290 వరద నీటిని రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కామారెడ్డి పెద్ద చెరువు సైతం పూర్తిగా నిండడంతో అలుగు దూకుతుండడంతో ఆ అందాలను చూసేందుకు పట్టణ ప్రజలు క్యూకడుతున్నారు. ఇలా జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులతో పాటు చెరువులు నిండడంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.


అలుగు దూకుతున్న బీబీపేట పెద్ద చెరువు


అలుగు దూకుతున్న సింగీతం రిజర్వాయర్


కళ్యాణి నుంచి విడుదలవుతున్న నీరు


అలుగు దూకుతున్న కోనాపూర్ చెరువు

మట్టి వినాయకులనే పూజిద్దాం..


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 3: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాల్లో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతిలను అందించి పర్యావరణంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు టీజీపీఎస్‌బీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ఆటో ట్రాలీల ద్వారా పర్యావరణ సందేశాలతో ప్రదర్శన చేయాలని తెలిపారు. చెరువుల్లో మట్టిమేటలని తొలగించడానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుం బిగించాలని మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చవచ్చని తెలిపారు.

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అధిక వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండాలి

అధిక వర్షాల ప్రభావం ఇంకా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం డివిజన్, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక వర్షాలతో చెడిపోయిన రహదారులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని అన్నారు. అధిక వర్షాల వల్ల చనిపోయిన వారి వివరాలు, దెబ్బతిన్న ఇళ్ల వివరాలను అందించాలని రెవెన్యూశాఖ అధికారులు ఆదేశించారు. అధిక వర్షాల వల్ల పాఠశాల భవనాలు దెబ్బతిని ఇబ్బందిగా మారిన పాఠశాలల వివరాలను అందించాలని, అవసరం అనుకుంటే పాఠశాలను సరిచేసే వరకు హాలిడేస్ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వంగిపోయిన స్తంభాలను సరి చేయాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

మాచారెడ్డి, సెప్టెంబరు 3: మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామానికి చెందిన కైరంకొండ శివరాములు అనే మత్స్యకారుడు మృతదేహం లభ్యమైంది. గత మూడు రోజుల కిందట ఎగువ మానేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన శివరాములు గల్లంతయ్యాడు. సహాయక చర్యలు చేపట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సోమవారం సాయంత్రం నుంచి వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం శివరాములు మృతదేహం లభ్యమైంది. దీంతో ఎస్‌ఐ అనిల్ మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 28 మంది ఎంపిక

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 3: 2024 సంవత్సరానికి గాను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 28 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయడం జరిగిందని డీఈవో రాజు తెలిపారు. ఇందులో ఒకరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, 21మంది స్కూల్ అసిస్టెంట్‌లు, 6ఎస్‌జీటీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పురస్కారాల కార్యక్రమాన్ని ఈనెల 5న సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో గల మీటింగ్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అడ్డగోలు మాటలు మానుకోవాలి

- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కు హితవు పలికిన ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ
- రామేశ్వర్‌పల్లిలో పునరావాస కేంద్రంలో బాధితులకు ఆర్థిక సహాయం
- ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అన్ని విధాలా ఆదుకుంటామని వెల్లడి
- అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల సర్వే చేయాలని ఆదేశం


రామేశ్వర్‌పల్లిలో వరద బాధితులకు అర్థిక సహాయం అందజేస్తున్న షబ్బీర్‌అలీ

భిక్కనూరు, సెప్టెంబరు 3: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రం అతలాకుతలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రతిపక్ష నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాతున్నారని, ఇకనైనా అడ్డగోలు మాటలు మానుకోవాలని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ హితవు పలికారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో నీట మునిగిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా అందరు మంత్రులు, ఎమ్మెల్యేలు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజల మధ్యలో ఉన్నామని అన్నారు. వరదల్లో సర్వం కోల్పోయినా వారిని అన్నివిధాలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్షాలపై ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ ఆరా తీస్తున్నారని అన్నారు. కానీ ఇలాంటి విపత్తులు వచ్చిన సమయంలో పార్టీలకు అతీతంగా నాయకులు ఉండాల్సింది పోయి మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి, మాజీ మంత్రి కేటీఆర్ విదేశాల్లో ఎంజాయ్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తనకు ప్రస్తుతం 101 డిగ్రీల జ్వరం ఉన్నా ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సీఎం ఆదేశాల మేరకు ఫీల్డ్‌లో తిరుగుతున్నానని అన్నారు. రామేశ్వర్‌పల్లిలో గత ప్రభుత్వం ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడి ఎఫ్‌టీఎల్ పరిధిలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించారని, తాను గతంలో ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి అప్పటి కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లానని అన్నారు. చెరువలో ఉన్న ఈ ఇళ్లు ఎప్పటికైనా కూలిపోవడం ఖాయమన్నారు. కానీ ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఈ వరద బాధితులకు తమ ప్రభుత్వం అండగా ఉండి వారికి త్వరలోనే పక్కా ఇళ్లను మరొక ప్రదేశాన్ని గుర్తించి నిర్మించి ఇస్తామన్నారు. అప్పటి వరకు వారిని పునారావాస కేంద్రంలో ఉంచి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అనంతరం 17 మంది కుటుంబాలకు రూ.2వేల తక్షణ సాయంతో పాటుగా పండ్లు, బట్టలు పంపిణీ చేశారు. వరద బాధితులకు అధికారులు, గ్రామస్థులు సహాయ సహకారాలను అందించాలని సూచించారు. అంతకుముందుగా శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి వెళ్లే 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోగా దానిని పరిశీలించారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శ్రీనివాస్‌తో మాట్లాడి వెంటనే రోడ్డుకు ఇరువైపుల సర్వీసు రోడ్డు బాగు చేయించి బీటీ వేయాలని ఆదేశించారు. ఆలయ కమాన్ నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డు మంజూరైందన్నారు.

నష్టపోయిన పంటలను సర్వే చేయాలి

అకాల వర్షాల కారణంగా భిక్కనూరు మండలంలో చాలా గ్రామాల్లో పంట దెబ్బతిన్నదని వ్యవసాయాధికారులు వెంటనే దెబ్బతిన్న పంటల సర్వే చేయాలని ఆదేశించారు. గతంలో సైతం అకాల వర్షానికి పంటలు నష్టపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల నష్ట పరిహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


బతుకమ్మ కుంటలో కొట్టుకుపోయిన డ్రైనేజీని పరిశీలిస్తూ..

లోతట్టు ప్రాంతాల పరిశీలన..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో వర్షంలో మునిగిన లోతట్టు ప్రాంతాలను మంగళవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పరిశీలించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఇళ్లు నీట మునగడం, ఇళ్లలోకి నీళ్లు రావడం, రోడ్లు కొట్టుకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. భారీ వర్ష సూచనతో కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయడం జరిగిందని అన్నారు. భారీ వర్షాల సమయంలో అత్యవసర సేవల కోసం పోలీసు బెటాలియన్లకు ఎన్‌డీఆర్‌ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వరదల్లో చనిపోయిన పశువులు, మేకలు, గొర్రెలకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వరద నష్టంపైన కేంద్రానికి సమగ్ర నివేదిక తక్షణమే కేంద్ర సాయం కోరుతూ, జాతీయ విపత్తుగా పరిగణలోకి తీసుకోవాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు.



కేజీబీవీలను తనిఖీ చేసిన డీఈవో

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 3: భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను తెలుసుకునేందుకు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం జిల్లాలోని పలు కస్తూర్బా గాంధీ విద్యాలయాలను పరిశీలించారు. మెండోరా, ముప్కాల్, బాల్కొండ కేజీబీవీలను తనిఖీ చేసిన ఆయన వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్పొరేటర్లు

నల్ల బిల్లుల పేరిట ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు

● కమిషనర్‌కు కాంగ్రెస్ కార్పొరేటర్ల వినతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 3: నల్లబిల్లుల పేరుతో నగర ప్రజలను వేధించవద్దని ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్నారని నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు గడుగు రోహిత్, చరణ్, అరుణ్, అక్బర్ హుస్సేన్‌లు అన్నారు. మంగళవారం నగర కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన కార్పొరేటర్లు కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అధిక మొత్తంలో నల్లబిల్లులు వాయిదా పడ్డాయని ఇప్పుడు హడావిడిగా బిల్లులు వసూలు చేయడం వల్ల ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వస్తుందని గడుగు రోహిత్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో కొంత మంది అధికారులు బిల్లులు వసూలు చేసే క్రమంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొంత మంది బిల్‌కలెక్టర్లు బిల్లులు సకాలంలో చెల్లించకపోతే నల్ల కనెక్షన్ తొలగిస్తామని పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎవరూ నల్లబిల్లులను చెల్లించవద్దని ఎవరైనా అధికారులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తే స్థానిక కాంగ్రెస్ నాయకులను, లేదా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెందిన మేయర్ కావాలనే కక్షపూరితంగా ఈ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులను అడ్డుపెట్టుకొని పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తుందని ఆయన అన్నారు. కొన్ని సంవత్సరాలు కాలక్షేపం చేసి ఇప్పుడు హడావిడిగా బిల్లుల కలెక్షన్ చేస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బంది పెడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా మేయర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. సామాన్యులను ఇబ్బంది పెడితే సహించేది లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాజ్, మోయిన్, సయ్యద్, హర్షద్, వేణురాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని రక్షిత మృతిపై విచారణ జరిపించాలి

● పీడీఎస్‌యూ, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 3: రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షిత శనివారం హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని చనిపోయిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పిడిఎస్‌యు, యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పోలీస్ కమీషనరేట్‌లోని డిసిపిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాత్‌రూమ్‌లో ఉరికి వేలాడుతూ మృతదేహం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థిని తల్లిదండ్రులు వచ్చేంత వరకు మృతదేహాన్ని ఆపకుండా ఆసుపత్రికి తరలించారని అదేవిధంగా హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని కావున ఈ విషయమై విచారణ జరిపి దోషులకు శిక్ష పడేలా చేయాలన్నారు. మహిళా లెక్చరర్లు ఉండగా పురుషులనే ఎందుకు వార్డెన్‌లుగా నియమించారని రక్షిత మృతి చెందిన రోజు ఏం జరిగిందో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు, యుఎస్‌ఎఫ్‌ఐ, పివైఎల్, బిఎస్‌పి నాయకులు జన్నారపు రాజేశ్వర్, పెద్ది సూరి, కార్తిక్, సత్యం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


డీసీపీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు













వృద్ధుడి వద్దకే తరలివచ్చిన న్యాయాధికారి



వృద్ధుడితో వివరాలు తెలుసుకుంటున్న కోర్టు న్యాయాధికారి

బోధన్‌రూరల్, సెప్టెంబరు 3: జిల్లాలోని బోధన్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం అనుహ్య పరిణామం చోటు చేసుకుంది. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని చూసి న్యాయాధికారి తన పీఠాన్ని వదిలి కదిలి వచ్చారు. ఓ కేసు నిమిత్తం మోస్రాకు చెందిన మిర్యాల్‌కర్ అశోక్ అనే 58ఏళ్ల వృద్ధుడు మంగళవారం న్యాయస్థానానికి వచ్చాడు. అయితే నడవలేని స్థితిలో వృద్ధుడు ఉన్నాడు. వృద్ధుడి పరిస్థితిని అతని తరఫు న్యాయవాది, కుమారులు న్యాయాధికారి సాయిశివకు వివరించారు. దీంతో న్యాయాధికారి సాయిశివ వెంటనే వృద్ధుడి వద్దకు వెళ్లి.. కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా.. వృద్ధుడి పట్ల న్యాయాధికారి మానవత్వంతో వ్యవహరించి.. అతని వద్దకే తరలిరావడాన్ని చూసిన అక్కడ ఉన్నవారందరూ న్యాయాధికారిని అభినందించారు.


నిండుకుండలా నిజాంసాగర్ ప్రాజెక్టు



నిండుకుండలా నిజాంసాగర్

నిజాంసాగర్, సెప్టెంబరు 3: నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుతూ ఉంది. ఆయకట్టును వర్షాకాలం యాసంగిలో సిరులు పండించేందుకు రైతాంగానికి సాగునీరు అందించండి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతూ ఉంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా దర్శనమిస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టును నమ్ముకున్న రైతాంగానికి ఈ ప్రాజెక్టు వర్షాకాలం వానాకాలంకి సాగునీరు అందించేందుకు నిలువ ఉంటుంది. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి 34900 వరద నీరు వచ్చి చేరుతుంది. నిజాంసాగర్ నీటి సామర్థ్యం 1405 అడుగులకు నీటి సామర్థ్యానికి గాను 1401 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులు 1401 అడుగుల సామర్థ్యానికి చేరుకుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి భారీవరద నీరు వచ్చి చేరుతూ నేడోరేపో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ఎత్తివేత మంజీరా నదిలోనికి వదిలివేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో భారీ వరద నీరు చేరుతూ ఉండటంతో అస్వాదించేందుకు పర్యటకులకు వస్తూనే ఉన్నారు. నిజాం సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న రైతులు కూడా ప్రాజెక్టును సందర్శించి పెరుగుతున్న నీటిని అస్వాదిస్తున్నారు.

కౌలాస్ ప్రాజెక్ట్‌కు చేరుతున్న వరదనీరు



కౌలాస్ ప్రాజెక్ట్‌లో నీరు చేరుతున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ మండలంలోని సావర్‌గాం గ్రామ శివారులో గల కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌కు గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో రావడం ప్రారంభం అయిందని ఏఈఈ రవి శంకర్ తెలిపారు. మంగళవా రం ప్రాజెక్ట్‌లోకి సుమారు 1712 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరినట్లు ఏఈఈ తెలిపారు. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం 458 మీటర్లకు గాను 456 మీటర్లు, 1.237 టీఎంసీలకు గాను 0.802 టీఎంసీల నీటిమట్టంకు చేరిందని రవిశంకర్ తెలిపారు. అయితే సాయంత్రం వరకు కౌలాస్ నాలా ఎగువ భాగంలో వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గిపోయిందని తెలిపారు.

అత్యాచార నిందితుడి రిమాండ్

నవీపేట,సెప్టెంబరు 3: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 6 సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 19సంవత్సరాల యువకుడు ఆదివారం అత్యాచారం జరిపాడు. ఒంటరిగా ఉన్న బాలికకు చాక్లెట్ కొనిస్తానని చెప్పి నమ్మించి ఆమెపై యువకుడు అత్యాచారం జరిపాడు. ఈ విషయంపై బాలిక కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు.

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలి



నగరంలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమీక్షిస్తున్న సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ

ఖిల్లా, సెప్టెంబరు 3: వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ సూచనలు, ఆదేశాలు పాటించాలని, మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని నగర ఇన్‌స్పెక్టర్ నరహరి సూచించారు. ఆయన ఛాంబర్‌లో మంగళవారం పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్‌సింగనెవార్, నిజామాబాద్ ఏసిపి రాజావెంకట్‌రెడ్డి ఆదేశాలపై మండపాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం చేయరాదని అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. గణేష్ విగ్రహాలు తీసుకువచ్చే సమయంలో ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. డిజెలకు అనుమతి లేదన్నారు. స్పీకర్‌తో కూడిన మైక్ అనుమతి కోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర మతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయరాదన్నారు. నిర్వాహకులు తమ వివరాలను తప్పనిసరిగా పోలీసులకు తెలియపర్చాలన్నారు. వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించే వారు ఎత్తు, ఏర్పాటు చేసిన ప్రదేశం, నిమజ్జనం తేదీ లాంటి సమాచారంపై తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ ద్వారాలాగిన్‌లో మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలను నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు.రిజిస్ట్రేషన్ అయ్యాక పోలీస్ స్టేషన్ నుంచి వచ్చే అనుమతితో పాటు క్యూఆర్ కోడ్‌ను, వారు జారీ చేసిన సూచనల పట్టికను మండపం వద్ద అందరికి కనపడే విధంగా ఉంచాలని తెలిపారు.గణేష్ మండపాల వద్ద షార్ట్‌సర్క్యూట్ జరుగకుండా నాణ్యమైన విద్యుత్ వైర్లను ఉపయోగించాలన్నారు. గణేష్ మండపాల నిర్వహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వివరాలను, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం కోసం ప్రతి గణేష్ విగ్రహం వద్ద ఐదుగురిని నిమజ్జనం బాధ్యత కోసం వారికి ప్రత్యేక టీషర్టులు ఉండాలన్నారు. . పోలీసు అధికారులు తనిఖీకి వచ్చిన సమయంలో వారి కోసంవిధిగా పాయింట్ పుస్తకం అందుబాటులో ఉంచాలన్నారు. మండపాల వద్ద అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు కనిపించినట్లయితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి సామరస్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలన్నారు.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఖిల్లా: ఈనెల 7వ తేదీ నుంచి జరిగే వినాయక ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సైలు మహేష్, వెంకట్రావ్‌లు తెలిపారు.

పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాలపై నిజామాబాద్ ఏసిపి రాజావెంకట్‌రెడ్డి నేతృత్వంలో శాంతి సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు సమన్వయం పాటిస్తూ సామరస్యంగా మెలగాలన్నారు. కుల మతాలకు అతీతంగా ఉత్సవాలను జరుపుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.మండపాల వద్ద ఎటువంటి పేకాట ఆడటం, మద్యం సేవించడం చేయరాదన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా క్యూ పద్ధతిని పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ మతాలకు చెందినమతపెద్దలు, శాంతికమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్: ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్స వాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సతీష్ కోరారు. మం గళవారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శాంతి కమిటీ సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో శనివారం నుంచి జరిగే గణేష్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రానున్న గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రజలు శాంతియుతంగా, సమన్వయంతో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పండుగలు మిలాద్ ఉన్ నబీ, గణేష్ ఉత్సవాలను కుల, మతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద మండప నిర్వాహకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, విద్యుత్‌కు సంబంధించిన వాటితో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, అన్నదాన కార్యక్రమాలు చేసినప్పుడు వ్యర్థాలను ఇష్టరీతిన పడేయకూడదని, కుక్కల బెడద ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. గణేష్ నిమజ్జనం రోజున ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. పండుగల సందర్భంగా మున్సిపల్, విద్యుత్, ఆర్ అండ్ బీ అధికారులు అన్ని రకాల సదుపాయలను కల్పిస్తారని ఏర్పాట్లలలో లోపాలు లేకుండా చూడాలని, నిర్వాహకులు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ ముక్తార్ అహ్మద్, ఆర్ అండ్ బీ అధికారి వినాయక గౌడ్, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

ఇందల్వాయి, సెప్టెంబరు 3: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని వరదల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మనోజ్‌కుమార్ అన్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు భారీ వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మంగళవారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. వరదల వల్ల జాగ్రత్తగా ఉండాలని చెరువులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లవద్దని సూచించారు. భారీ వర్షాలతో రోడ్లపై నీరు ప్రవహిస్తోందని కల్వర్టులు, రోడ్లు దెబ్బతిన్నందున పర్యాటకులు సందర్శించేందుకు చెరువుల వద్దకు వెళ్లవద్దని ఆయన తెలిపారు. ఇందల్వాయి నుండి ధర్పల్లి వెళ్లే రోడ్డులో పాటితాండా వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున తాత్కాలికంగా వేసిన రోడ్డు పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయిందని దాంతో అటువైపు వాహనాలు వెళ్లకుండా దారి మూసివేసినట్లు ఎస్సై తెలిపారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబరు 3: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని మంగళవారం ధర్మారం గ్రామస్థులు ఎడపల్లి మండల తహసీల్దార్ ధన్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మారం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించి పూర్తి చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వం గతవారం రోజుల క్రితం ధర్మారం గ్రామంలో కొందరికి కేటాయించగా వారు గృహప్రవేశం చేశారు. అదే గ్రామంలో కొందరు తాము కూడా చాలా ఏళ్లగా గుడిసెలలో నివాసం ఉంటున్నామని మాకు ఎలాంటి ఇళ్లు లేవని మాకు కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో ధర్మారం గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



నందిపేటలో మట్టితో తయారు చేసిన కాడెడ్లను ఊరేగిస్తున్న వీడీసీ సభ్యులు

నందిపేట, సెప్టెంబరు3:మండలంలో మంగళవారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఎడ్లు ఉన్న రైతులు వాటిని శుభ్రం చేసి, కొమ్ములకు రంగులు అద్ది నూతన వస్త్రాధారణ చేశారు. ఎడ్లు లేని రైతులు మట్టితో తయారు చేశారు. అంతే కాకుండా ట్రాక్టర్లను శుభ్రం చేసి బ్యానర్లు, బుగ్గలు కట్టారు. డప్పులతో ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నందిపేట మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేయించారు.ముందుగా రైతులు ర్యాలీలో కోలాటం, కర్ర తిప్పడం చేశారు. ఈ కార్యక్రమంలో నందిపేట వీడీసీ సభ్యులు బంగ్ల నవీన్, మచ్చర్ల చిన్న సాయిలు, వాసరి రాంచందర్, ఏర్రం కొతూర్ భాస్కర్, ఏర్రం మురళి, చిలివేరి ముత్యం, పేట్ల శ్రీను, రమేష్, చిన్నయ్య, శేఖర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం మట్టి ఎద్దులను ఊరేగించారు. పొలాల అమావాస్య సందర్భంగా గతంలో భారీ సంఖ్యలో ఎద్దుల జతలతో ఊరేగింపు జరిపేవారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వంతెనల వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్లు



మీరిబాయి తండా వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

సిరికొండ సెప్టెంబరు 3: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వరద ప్రవాహానికి వంతెనల వద్ద అప్రోచ్ రోడ్లు దెబ్బతిని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారింది.పర్వన్ తండా పంచాయతీల పరిధిలోని అడవుల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహించాయి.దీని వల్ల మీరీబాయి తండా నుంచి సుభాష్ తండా,నామ్డ తండాలకు వెళ్లే దారిలో గల వంతెన వద్ద అప్రోచ్ రోడ్లు తెగిపోవడంతో ఆ రెండు తండాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అప్రోచ్ రోడ్లు తెగిపోవడం వల్ల వరద నీళ్లు వరి పంటను నష్టం చేసిందని గిరిజనులు చెప్పారు. పొలాల్లో ఇసుక మేట పెట్టిందని వారు ఆవేదనతో చెప్పారు. మిగిలిన తండాలకు గాని తూంపల్లి గ్రామానికి రావడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. వారు ఎటు వైపు వెళ్లాలన్న బురదలో పాదయాత్ర చేయక తప్పడం లేదని తండా ప్రజలు చెప్పారు. తాము ఎన్నాళ్లు ఈ నడక యాతన సాగించాలని వారు ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. గిరిజన కార్పొరేషన్ నిధులతో వాగుపై వంతెన నిర్మించి నప్పటికిలో లెవల్‌గా నిర్మించడమే తప్పు జరిగి ఉండవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. సుభాష్ తండా,నామ్డ తండాల ప్రజలకు రాక పోకలు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను గిరిజన యువకులు కోరుతున్నారు. తాత్కాలికంగా నడిచే విధంగా ఏర్పాట్లను చేయాలని మాజీ సర్పంచ్ సంగ్యా నాయక్ విజ్ఞప్తి చేశారు.

ఐలాపూర్ ప్రభుత్వ హాస్టల్‌లో వైద్యశిబిరం

నందిపేట, సెప్టెంబరు3: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో మంగళవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులలోని డెంగీ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. అలాగే అంటువ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు శుభ్రంగా ఉండాలని డాక్టర్ ప్రవీణ్ కోరారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దేవన్న, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్, భాస్కర్, ఏఎన్ఎంలు వనజ, జ్యోతి, రేణుక, ఆశావర్కర్లు, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

రూ.5కోట్ల నిధులను మంజూరు చేయాలి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు3: మున్సిపల్ పరిధిలో రోడ్ల నిర్మాణానికి తక్షణమే రూ.5కోట్ల నిధులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులు మంజూరు చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సీఎం జిల్లాకు తక్షణ సహాయం కింద నిధులు కేటాయించారని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో రోడ్లు అధ్వాన్నంగా మట్టిరోడ్లతో ఉన్నాయని, వర్షాకాలంలో కొన్ని కాలనీల్లో ప్రజలు బయటకు వెళ్లాలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని, తక్షణమే నిధులను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

మాక్లూర్, సెప్టెంబరు3: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందిపడకుడదని ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ రవిప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం మానిక్ బండార్ చౌరస్తా వద్ద ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. రహదారిపై ప్రవహిస్తున్న వరదనీటిని, కాల్వ తవ్వించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా నీటిని మళ్లించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు వీర్‌సింగ్, గడ్డం చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్టీక్రాప్ హార్వెస్టర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌రూరల్,సెప్టెంబరు3: మల్టీక్రాప్ హార్వెస్టర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీఈవో షర్ఫోద్దీన్ అన్నారు. మంగళవారం అత్యాధునిక తక్కువ మెంటెనెన్స్ డీజిల్ ఆదా ధృడమైన డబుల్ చాసీస్‌తో మల్టీక్రాప్ హార్వెస్టర్లను రైతులకు అందుబాటులోకి తెచ్చారు. మంగళవారం బోధన్‌లో అయ్యప్ప ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో హార్వెస్టర్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెగొండ, సునంద, శ్రీనివాస్‌లతో ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కంపెనీ అధికారులు, వ్యవసాయదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు3: ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన విజయకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని అందజేశారు. విజయకు శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి కింద ఎల్‌వోసీని ఇప్పించారు. ఎల్‌వోసీ మంజూరు చేసిన వినయ్‌రెడ్డికి, సీఎం రేవంత్‌రెడ్డికి బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సంతమల్లన్నకు శ్రావణమాసం పూజలు

వేల్పూర్, సెప్టెంబరు3: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ ఆరాధ్యదైవమైన సంతమల్లన్న శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతమల్లన్న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు దేగాం రాములు, ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, సంతమల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది

బోధన్‌రూరల్,సెప్టెంబరు 3: రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని వాసవీక్లబ్ వనిత బోధన్ అధ్యక్షురాలు డాక్టర్ శాంతిశ్రీ అన్నారు. మంగళవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లడ్ బ్యాంక్‌లో స్వయంగా ప్రసూతి వైద్యురాలు డాక్టర్ శాంతిశ్రీ స్వయంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం మహా గొప్పదానం అన్నారు. రక్తదానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్యరావులతో రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో ఉమా మహేశ్వర ఆలయం

నందిపేట, సెప్టెంబరు3: మండలంలోని ఉమ్మెడ శివారులో గోదావరి నదిఒడ్డున ఉన్న ఉమామహేశ్వర ఆలయం వరద నీటిలో మునిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ఉధృతి పెరిగింది. దీంతో నది ఒడ్డున ఉన్న ఆలయం చుట్టూ వరద నీరు చేరింది. మహారాష్ట్ర రాష్ట్రంలో సైతం వర్షాలు కురియడంతో గోదావరి నదిలో వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆలయం చుట్టు నీటి ప్రవాహం ఎక్కు వ కావడంతో దేవుడికి ధూప,దీపనైవేద్యంకరువైనట్లే. 2025 జనవరి, ఫిబ్రవరి మాసం వరకు దేవుడిదర్శనం కరువైనట్లేనని గ్రామస్థులు తెలిపారు.

'రక్షిత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి'

రుద్రూరు, సెప్టెంబరు 3:నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండ లం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అగ్రి కల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్యపై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. మంగళవారం రుద్రూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతోభవిష్యత్తు ఉన్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నా రు. విద్య వ్యవస్థ మీద విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడం కూడా ఒక కారణమన్నారు.మృతికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదే విధంగా రక్షిత కుటుం బానికి ప్రభుత్వం యాభైలక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం కల్పించి భరోసా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులు

కమ్మర్‌పల్లి,సెప్టెంబర్3: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు వరదల కారణంగా కమ్మర్‌పల్లి మండలంలోని కమ్మర్‌పల్లి ఉప్లూర్ గ్రామాలమధ్య వరదకాలువ సమీపంలో కల్వర్టు మరింత కోతకుగురికావడంతో ప్రమాదల నివారణ నిమిత్తం స్థానిక పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆరహదారి రెండుచోట్ల కోతకు గురియ్యింది. స్థానికులు చెట్ల కొమ్మలు వేసి ప్రమాదసూచికలు ఏర్పాటు చేశారు.మండంలోని కోనాసమందర్ నుంచి అమీర్‌నగర్ వెళ్లే రహదారి కల్వర్టు కొట్టుకు పోగ రహదారి కోతకు గురికావడంతో అధికారులు ట్రాక్టర్‌లను అడ్డంగా పెట్టి రహదారిని మూసివేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఈప్రాంతంలోని పంటపొలాలకు వెళ్లే రైతులు నర్సాపూర్, అమీర్‌నగర్ గ్రామాలమీదుగా ఆరు కిలోమీటర్ల దూరంనుంచి తిరిగి వెళ్లాల్సివస్తోంది. కాగా మండలంలోని కోనాపూర్ గ్రామం నుంచి కొత్తచెరువుతండా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడగా అధికారులు ప్రమాదసూచికలు ఏర్పాటు చేశారు. ఉప్లూర్ నుంచి నాగాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి చెరువువద్ద కోతకు గురయ్యింది.ద్విచక్రవాహనాలు తప్ప పెద్దవాహనాలుదాటేఅవకాశంలేకుండా పోయింది. మండలంలోని కోనాపూర్ రహదారి వదరనీటికి కోతకు గురయ్యింది

జక్రాన్‌పల్లి: అల్పపీడన ప్రభావంతో మండలంలో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. అన్ని గ్రామాల చెరువుల్లో వరదనీరు వచ్చి చేరుతుంది. పడకల్, కేశ్‌పల్లి ఉమ్మడి గ్రామాల పెద్ద చెరువు, అర్గుల్ పల్‌చెరువు, మిగతా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుగా పారాయి. ఇంక కొన్ని గ్రామాల్లో అలుగు పారే దశకు చేరుకున్నాయి. భారీ వర్షం కురిస్తే ఆ గ్రామాల్లో చెరువుల అలుగులు పారుతాయని ఆ గ్రామాల ప్రజలు తెలిపారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వివిధ గ్రామాల్లో వర్షం నీరు నిలిచి రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. బాలనగర్‌లో గుడిసె నివాసముంటున్న 12కుటుంబాలను పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడే 12కుటుంబాలకు భోజనాలు ఏర్పాట్లు చేసి నిత్యావసర సరుకులు ఏర్పాటు చేశారు.

మోపాల్: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని ఎల్లమ్మకుంట గ్రామ సమీపంలో విద్యుత్‌స్తంభం కిందపడిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం సందర్శించి స్థంభాన్ని నిలబెట్టారు. స్థంభం కిందపడిపోవడంతో ఈ ప్రాం తంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటీన చేరుకున్న అధికారులు విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కింద పడ్డ విద్యుత్ స్థంభాన్ని యథావిధిగా నిలబెట్టి మరమ్మతులు చేపట్టారు. రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మోపాల్: గత మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని మంచిప్పకులాస్‌పూర్, కొండెం చెరువు, మోపాల్ చెరువు, మాసాని చెరువులు నిండి పొర్లుతున్నాయి. ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మండలంలో ఉన్న చిన్న పెద్ద చెరువులన్నీ వరద నీటితో నిండిపోయి కాలువల ద్వారా బయట ప్రవహిస్తున్నాయి. ఈ సంవత్సరం రెండు పంటలు పండటం ఖాయమని మండల రైతులు ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. చెరువులు నిండటంతో ఆయాగ్రామాలప్రజలు చెరువుల వద్దకు వెళ్లి సందర్శిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అవసరమైన సమయంలోనే బయటకు రావాలని మైకుల ద్వారా కోరుతున్నారు.



కోనాసమందర్ అమీర్‌నగర్ గ్రామాల మధ్య కొట్టుకు పోయిన కల్వర్టు

డిచ్‌పల్లి: నడిపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్ కో ఏఈ సాయిలు సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. అనంతరం నూతన స్తంభాన్ని అమర్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పనులు వేగవంతంగా చేయడంతో స్థానికులు విద్యుత్ ఏఈకి ధన్యవాదలు తెలిపారు.

నవీపేట: మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం భారీ సైజు చెట్టు నేలకొరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెట్టు వేళ్ల కింద మట్టి వదులు కావడంతో ఆకస్మాత్తుగా చెట్టు రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ సమయంలో ఎటువంటి వాహనాలు రోడ్డుపై వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో నవీపేట, జన్నేపల్లి మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన ఎస్ఐ వినయ్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ అండ్ బీ అధికారులు సంబంధిత చెట్టును జేసీబీ సహాయంతో పక్కకు తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

బోధన్‌రూరల్: బోధన్ డివిజన్‌లో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అతాలకుతలం అవుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రహదారులన్ని వర్షపు నీటితో పొంగిపొర్లుతున్నాయి. సాలూర అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద మంజీర నది కింద బ్రిడ్జికి తగులుతూ ఉధృతంగా ప్రవహిస్తుంది. సాలూర అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని సాలూర తహసీల్దార్, మహారాష్ట్ర పోలీసులు పర్యవేక్షించారు.

● హంగర్గ గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి: బోధన్ ఆర్డీవో

హంగర్గ గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిండిపోవడంతో హంగర్గ గ్రామంలో వర్షపు నీరు గ్రామంతో పాటు పంట పొలాల్లోకి చేరింది. గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అక్కడే పని చేస్తుందన్నారు. హంగర్గ గ్రామస్థులతో మాట్లాడుతూ నీటికి సరిహద్దులో ఉన్న ఇళ్ల వారు తమ ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి రావాలన్నారు.

● నీట మునిగిన 1120ఎకరాల సోయాపంట

కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని హంగర్గ, కొప్పర్గ, బికెనెల్లి, సిద్ధాపూర్ తదితర గ్రామాలలో సుమారు 1120ఎకరాల సోయాపంట నీట మునిగిందని బోధన్ వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాలను నీట మునిగిన పంటల పొలాలను పరిశీలించారు.



విద్యుత్ స్తంభాన్ని మరమ్మతులు చేసిన అధికారులు

● ఖండ్‌గావ్, కొండల్‌వాడి గ్రామాల మధ్య రాకపోకల బంద్

తెలంగాణ సరిహద్దు గ్రామామైన ఖండ్‌గావ్ బ్రిడ్జి పైనుండి వర్షపు నీరు ప్రవహిస్తుండడం ప్రమాదకరంగా మారడంతో ఖండ్‌గావ్ నుండి మహరాష్ట్రకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఖండ్‌గావ్ నుండి మహరాష్ట్ర కొండల్‌వాడి వెళ్లేవారు బోధన్, సాలూర కొత్త బ్రిడ్జి మీదుగా వెళ్లాలని సూచించారు.

● హంగర్గ గ్రామంలో అధికారుల పర్యటన

హంగర్గ గ్రామాన్ని మంగళవారం బోధన్ ఆర్డీవోతో పాటు సంబంధిత శాఖ అధికారులు పర్యటించారు. గ్రామంలోని ఎంతైన భవనాలపైకి ఎక్కి ఎస్సారెస్పీ వరద నీటిని పరిశీలించారు. వరద నీటికి దగ్గరగా ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

● గోదావరి ప్రవాహంతో నీట మునిగిన పంటలు

నవీపేట: మండలంలోని కోస్లీ, మిట్టాపూర్ శివారులలో గోదావరిలో నీటి ప్రవాహం పెరగడంతో పంటలు నీట మునిగాయి. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురువడంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్ర నుండి భారీ నీటి ప్రవాహం రావడంతో కోస్లీ, మిట్టాపూర్ శివారులలో ఉన్న సుమారు 250ఎకరాల వరకు వరిపంట నీట మునిగిందని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి శ్రీరాంసాగర్ ద్వారా దిగువకు ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని రైతులు కోరారు.

● హమ్మయ్య అలుగు పారింది

ధర్పల్లి: ధర్పల్లి గ్రామస్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ధర్పల్లి ఊర చెరువు అలుగు మంగళవారం తెల్లవారుజామున పారడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన జూన్ నెల నుంచి చెరువులోకి ఒక్క చుక్క కూడా వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ చెరువు ధర్పల్లి, సీతాయిపేట గ్రామాలకు జీవనాధారం అయ్యింది. రెండు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి చెరువును తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. ప్రత్యేక అధికారి బాలకిషన్, ఈవో, గ్రామస్థులు పూజలు చేశారు.



లింగంపేటలో యునాని వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

యునాని వైద్య శిబిరానికి విశేష స్పందన

లింగంపేట, సెప్టెంబరు 3: మండల కేంద్రంలో బుధవారం యునాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 140 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యురాలు విజయ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యునాని వైద్యం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. యునాని వైద్యంతో సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఆకుల శ్రీకాంత్, ఫార్మాసిస్ట్ స్వేత, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రహదారి పనుల్లో నష్టం జరగకుండా చూడాలి

నిజాంసాగర్, సెప్టెంబరు 3: మహ్మద్‌నగర్ మీదుగా కొనసాగుతున్న 765/డి రహదారి వెడల్పు పనుల్లో ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్నామని తాము నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం మహ్మద్‌నగర్‌కు చెందిన ప్రజలు తహసీల్దార్ సవాయి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రహదారి వెడల్పు పనులు ఇరువైపులా 50 ఫీట్లు మేర కొనసాగుతున్నాయని మండల కేంద్రంలో 5ఫీట్లు తగ్గించి, ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వాజీద్ అలీ, దఫేదార్ విజయ్, జాక్సాని శ్రీనివాస్, జక్సాని భాను, ఎలగందల రాజు, విజయ్, రాము, వెంకన్న, మల్లేశం, నాగరాజు, కాశీనాథం, శ్రీనివాస్, భాస్కర్, నిఖిల్, వికాస్‌గౌడ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సామగ్రి అందజేత

బీర్కూర్, సెప్టెంబరు 3: గత రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల ధాటికి పలువురి ఇళ్లు కూలిపోయాయి. అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా మంగళవారం పునరావాస కేంద్రంలో ఉన్న 8 మంది బాధితులను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వంట సామగ్రితో పాటు సరుకులు అందజేశారు. ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన బాధితులకు తమవంతు సహకారం అందించామని సభ్యులు తెలిపారు.

పంచాయతీలో పునరావాసం

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 3 : మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన రెండు కుటుంబాల సభ్యులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా పునరావాసం కల్పించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామానికి చెందిన రాజీపేట లక్ష్మి, రాజీపేట, రామవ్వల నివాసపు ఇల్లు కూలిపోవడంతో ఈ రెండు కుటుంబాలను మంగళవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో పునరావాసం కల్పించినట్లు ఆయన తెలిపారు.

నిత్యావసర సరుకుల అందజేత

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 3: పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించిన మున్సిపల్ కౌన్సిలర్లు వారికి తాత్కాలికంగా పునరావాస కేంద్రాన్ని నీలకంఠేశ్వర ఆలయం పక్కన ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. వారికి మంగళవారం నిత్యావసర సరుకులు, బియ్యం, పప్పు, నూనె, వివిధ వంట సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ, శ్రీకాంత్, గొండ భూదేవి, శ్రీనివాస్, జంగం నీలకంఠం, రాము, సుభాష్, గాదె తిరుపతి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 3: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వండిన వంటలను పరిశీలించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ మహేందర్, ఎంపీవో ప్రకాష్‌లు ఉన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్యమిత్రల నిరసన

దోమకొండ, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఆరోగ్య మిత్రలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర బవి. మధుసూదన్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలకు డీపీవో క్యాడర్ కేటాయించాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్, జనని, రాణి, తిలోత్తమ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

రామారెడ్డి,సెప్టెంబరు 3: నాలుగు గ్రామాల్లో మంగళవారం పారిశుధ్య పనులను మంగళవారం మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సువర్ణ పరిశీలించారు. రామారెడ్డి మండలం పోసానిపేట్, ఉప్పల్‌వాయి, గిద్ద, గోకుల్‌తండా గ్రామాల్లో శానిటేషన్, డ్రైడేపైన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హస్టల్ వార్డెన్లు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు రెయిన్ కోట్‌ల పంపిణీ

భిక్కనూరు, సెప్టెంబరు 3: భిక్కనూరులో పంచాయతీ కార్మికులకు గ్రామానికి చెందిన న్యాయవాది రాజాబాబుగౌడ్ రెయిన్‌కోట్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ఈ రెయిన్ కోట్‌లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

ప్రవాహం ఎక్కువగా ఉంటే వాగులు దాటొద్దు

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్, సెప్టెంబరు 3: మద్నూర్ మండలం గోజేగావ్ గ్రామానికి వెళ్లేలో లెవల్ వంతెన వద్ద నుంచి ప్రవహిస్తున్న లెండి వాగు ప్రవాహాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. వాగు పరిస్థితులు, వంతెన స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న కారణంగా లెండి వాగును మండల తహసీల్దార్, ఎంపీడీవోతో కలిసి పరిశీలించారు. నిన్న వాగుపై నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంగళవారం వాగును పరిశీలించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉంటే గ్రామస్థులు వాగులు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంతంలోని 12 గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమయంలోనైనా తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ చేయాలని సూచించారు. మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ వెంట మద్నూర్ మండల తహసీల్దార్ ఎం.డి.ముజీబ్, ఎంపీడీవో రాణి, ఎంపీవో నర్సయ్య, గిర్దావర్ శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఓటరు సవరణ నమోదు వేగవంతం చేయండి

పెద్ద కొడప్‌గల్,: జుక్కల్ మండలంలో ఓటరు సవరణ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బీఎల్‌వోలకు సూచించారు. మంగళవారం మండలంలోని కౌలాస్ గ్రామంలో ఓటరు సవరణ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజేసీ మాట్లాడుతూ వర్షాల కారణంగా సవరణ కార్యక్రమం నిదానంగా నడుస్తుందని, అయితే వర్షాలు తగ్గుముఖం పట్టినందున ఓటరు సవరణ నమోదు కార్యక్రమం ఆన్‌లైన్‌లో వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం పరిశీలించారు. గ్రామంలో మెరుగైన పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. దీంతో పాటుగానే గ్రామంలో ఏవైనా శిథిలమైన ఇళ్లు ఉంటే వారికి స్థానికంగా ఉన్న పాఠశాలలో నివాసం కల్పించాలని తహసీల్దార్‌కు సూచించారు. అంతకుముందు కౌలాస్‌నాలా ప్రాజెక్టును సందర్శించి ఇన్‌ఫ్లో వివరాలు ఏఈఈ రవి శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ రాము పటేల్, ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



లెండి వాగు వద్ద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, సిబ్బంది

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తాడ్వాయి: భారీ వర్షాలు పడుతున్నందున అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. వర్షానికి దెబ్బతిన్న పంట, ఆస్తినష్టాన్ని అంచనా వేయాలని తెలిపారు. వర్షానికి కూలుతున్న ఇల్లు ఉంటే వెంటనే గుర్తించి నివాసులకు పునరావాసం కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ సయ్యద్‌సాజిద్ అలీ, మండల అధికారులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఆందోళన

● లోనికి ప్రవేశించిన లబ్ధిదారులు ● అడ్డుకున్న అధికారులు



బస్వాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద అధికారులతో వాగ్వావాదం చేస్తున్న లబ్ధిదారులు

భిక్కనూరు, సెప్టెంబరు 3: మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులోని పెద్దమల్లారెడ్డి రోడ్డులో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం గతంలో గ్రామ సభలో ఎంపిక చేసిన లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్దకు చేరుకుని వాటికి ఉన్న తాళాలు తీసి లోనికి ప్రవేశించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై సాయికుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని బయటకు పంపించారు. దీంతో లబ్ధిదారులు ఇంకెన్ని రోజులు తమకు ఈ డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించకుండా ఆపుతారని వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు వీటిలో ఎవరు ప్రవేశాలు చేయకూడదని అధికారులు వారికి చెప్పారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల ముందు గత కలెక్టర్ జితేష్ వీ పాటిల్ తమకు ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని సూచించారని, ఆ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో కేటాయింపు ప్రక్రియ ఆగిపోయిందన్నారు. ఎన్నికల తర్వాత వాటిని తమకు అప్పగించకుండా అధికారులు మరల ప్రస్తుత కలెక్టర్ చెప్పేంత వరకు కేటాయించమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై కలెక్టర్ దగ్గరకే వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పంపిణీ చేయాలి : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

గతంలో గ్రామసభలను ఏర్పాటు చేసి అర్హులైనా నిరుపేదలైనా ఇళ్లు లేని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆ ఇళ్లను పంపిణీ చేసే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చిందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లితే అధికారులు వారిని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఎంపిక చేసిన బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాలకు చెందిన వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించిన అధికారులు



భవానిపేటలో కూలిన రెండు అంతస్తుల భవనం

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 3 : గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా కూలిన ఇళ్లను అధికారులు సర్వే జరిపి వివరాలు సేకరిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా మండలంలో ఇప్పటి వరకు తెలిసిన సమాచారం మేరకు 9 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. కూలిపోయిన ఇళ్లను రెవెన్యూ సిబ్బంది సర్వే జరిపి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామంలో 3, బొల్లారంలో 1, లింగంపల్లిలో రెండు, గోపాల్‌పేట్‌లో ఒకటి, తాండూర్‌లో రెండు ఇళ్లు పాక్షికంగా కూలినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో వర్షాలకు కూలిన ఇంటిని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య ఉన్నారు.

లింగంపేట: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మొత్తం 17 ఇళ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ నరెందర్ తెలిపారు. మండలంలోని భవానిపేట, లింగంపేట, ఐలాపూర్, మోతె, నల్లమడుగులతో పాటు పలు గ్రామాల్లో 17 ఇళ్లు కూలి పోయినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో తహసీల్దార్ ఎంపీడీవో, ఎంపీవోతో కలిసి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు రాజు, ప్రసాద్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రామాగౌడ్‌లు పరిశీలించి బాధితులకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వారు తెలియజేశారు.

బీర్కూర్: మండలంలోని బరంగేడ్గి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం ఓ భారీ వృక్షం నేలకూలింది. దీంతో రాకపోకలకు అటంకం కలిగింది. వెంటనే గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సిబ్బంది తొలగించారు. ఇందులో గ్రామ పంచాయతీ కార్యదర్శి గురునాథ్, కారోబార్ పర్వయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

దోమకొండ: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమకొండ, చింతమాన్‌పల్లి, గొట్టిముక్కుల గ్రామాల్లో ఇళ్లు కూలాయి. భారీ వర్షం కురియడంతో వాగులు పారుతున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. కాలువలు, కుంటలు పెద్ద ఎత్తున నీటితో ప్రవహిస్తున్నాయి.

నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కాసుల బాలరాజు



నిజాంసాగర్ నీటిని పరిశీలిస్తున్న ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజు

నిజాంసాగర్, సెప్టెంబరు 3: నిజాంసాగర్ ప్రాజెక్టును మంగళవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీయల్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వలను పరిశీలించారు. నిజాంసాగర్ పూర్తి నీటి సామర్థ్యం అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఉమ్మడి జిల్లాలోని లక్ష 15వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉండటంతో ఎంతో అదృష్టమని ఆయన అన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతూ ఉండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యానికి చేరుకునే అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు అంటేనే ఉభయ జిల్లాలోని రైతాంగ దీనిపైన ఆధారపడి ఉన్నారని ఆయన అన్నారు. వానాకాలం యాసంగిలకు నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిన సాగునీరు అందిస్తుందని ఆయన అన్నారు. ఆయన వెంట బాన్సువాడ నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అన్నారెడ్డిపల్లి వంతెన మరమ్మతు చేసిన ఎంపీడీవో

లింగంపేట, సెప్టెంబరు 3: మండలంలోని అన్నారెడ్డిపల్లిలో భారీ వర్షాలకు లోలెవల్ వంతెన కొట్టుకుపోవడంతో కోమట్‌పల్లి - అన్నారెడ్డిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పరిశీలించేందుకు గ్రామానికి వచ్చిన ఎంపీడీవోకు గ్రామస్థులు ఈ విషయాన్ని తెలియజేశారు. స్పందించిన ఎంపీడీవో వెంటనే తాత్కాలికంగా మట్టిని వేయించి రాకపోకలు పునరుద్ధరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్

● కంటైనర్ డ్రైవర్ మృతి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 3: కామారెడ్డి పట్టణ శివారులోని నేషనల్ హైవేపై గల నేషనల్ ఫ్యామిలీ దాబా వద్ద ఆగి ఉన్న లారీని మంగళవారం కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం భారత్‌పూర్‌కు చెందిన షారుక్‌ఖాన్(22) కంటైనర్ లారీతో హర్యానా నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్నాడు. అప్పటికే తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజపండి అనే డ్రైవర్ లారీని ఆపాడంతో షారుక్‌ఖాన్ ఆ లారీని ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే షారుఖ్‌ఖాన్ మృతి చెందాడు. నిర్లక్ష్యంగా లారీని ఆపిన రాజపండిపై మృతుడి బంధువు అక్బర్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వైన్స్‌లో మద్యం, నగదు చోరీ

లింగంపేట, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని ఎమ్ఎస్‌జీ, రాజావైన్స్‌లలో చోరీ చేసి మద్యంతో పాటు రూ.15వేల నగదును అపహరించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వైన్స్ నిర్వాహకులు ప్రతీరోజు మదిరి తాళం వేసి వెళ్లగా తాళం పగులగొట్టి అందులోని బ్లాక్ అండ్ వైట్, విలియమ్‌సన్ ఫుల్‌బాటిల్స్ ఎత్తుకుపోయినట్లు నిర్వాహకుడు హర్షవర్ధన్‌గౌడ్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు

నిజాంసాగర్, సెప్టెంబరు 3: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు దొంగలను నిజాంసాగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంసాగర్ పోలీసులు సోమవారం నరసింగరావుపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. ఉబ్బిలి లింగమయ్య, చిత్తారి రమేష్, తురపాటి ఏసు దాసరి రాజు, తూరపాటి అంజయ్యలు మహారాష్ట్ర దగ్గరలో రాగి వైర్‌ను అమ్ముకోవడానికి వెళుతుండగా మార్గమధ్యలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసి వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిలో ఒకరు పోచయ్య ఆచూకీ దొరకడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి పాల్పడిన కేసులో వీరిని విచారించి నిందితులుగా గుర్తించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. నేరస్తులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అసలు పోలీసులు అరెస్టు చేసిన నిందితులు ఉన్నారనేది అనుమానం వ్యక్తం అవుతుంది. దొంగతనం చేసిన రాగి వైరు విలువ లక్షల రూపాయల విలువ ఉంటుందని ఎస్ఐ తెలిపారు. వీరిని పట్టుకోవడంతో ఎస్ఐ సుధాకర్ హెడ్ కానిస్టేబుల్ సతీష్, శ్యామ్, రఘు, సంగమేశ్వర్‌లను రాజు, బాలాజీలను కామారెడ్డి ఎస్పీ అభినందించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

బిచ్కుంద, సెప్టెంబరు 3: బిచ్కుంద పోలీసుస్టేషన్ సర్కిల్ పరిధిలోని మండలాల్లో రౌడీ షీటర్లుగా నమోదైన వారికి బిచ్కుంద సీఐ నరేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళవారం బిచ్కుందలోని పోలీసుస్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని మండలాల్లోని పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్లుగా నమోదైన వారిని పిలిపించి గణేష్ నవరాత్రులు పండుగ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజూ పోలీసుస్టేషన్‌కు హాజరుకావాలని మీపై ఎవరైన ఫిర్యాదు చేయకుండా నడుచుకోవాలని సీఐ తెలిపారు.

సహాయ చర్యలపై వీడియో కాన్ఫరెన్స్

రాజంపేట, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, గ్రామాల్లో పారిశుద్యం, సహాయ చర్యలు దెబ్బతిన్న మౌలిక సదుపాయాల సమాచారం వివరాల కోసం వీసీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు

సదాశివనగర్,సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను మంగళవారం పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ గంగాసాగర్ తెలిపారు. తిరమన్‌పల్లిలోని బెస్తసాయిలు, బెస్తశంకర్, బెస్త నర్సవ్వకు చెందిన కూలి పోయిన ఇండ్లను పరిశీలించి బాధితులకు పునరావాసకేంద్రాలకు తరలించి నష్టపరిహారాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - సరిపోదా శనివారం
దర్శన్ - కమిటీ కుర్రాళ్లు
ప్రియా 70 - ఆయ్
ప్రియా 35 - ఆహో విక్రమార్క

బాన్సువాడ

మహేశ్వరి - సరిపోదా శనివారం
వెంకటేశ్వర - తంగలాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

